క్లుప్తంగా

పంటలను ధ్వంసం చేస్తున్న అడవిపందులు



పందుల దాడిలో ధ్వసమైన పత్తి మొక్కలు

పెంచికల్‌పేట్‌: పత్తి పంటపై అడవి పందుల గుంపులు, గుంపులుగా దాడులు చేయడంలో పంటలు ధ్వంసం అవుతున్నాయి. పత్తి కాత దశలో ఉండగా రాత్రి వేళల్లో పందులు గుంపులు పంటలపైన దాడులు చేస్తున్నాయి. వందల సంఖ్యలో ఉన్న గుంపులు పత్తి చెట్లను విరిచి గూళ్లు చేస్తున్నాయి. చేతికి అందివచ్చిన పంటలపైన పందులు దాడులు చేస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పందుల నుంచి పంటలను రక్షించుకోవడానికి పంట చేల వద్ద కాపలా ఉంటున్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న ఆకసం ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో గురువారం ఆసిఫాబాద్ కవుల సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఆకసం నెలపొడుపులో భాగంగా వినాయక చవితిపై నిర్వహించిన ఈ సమ్మేళనంలో కవితలు ఆకట్టుకున్నాయి. వినాయక చవితి విశిష్టతోపాటు పండుగ జరుపుకొనే విధానంపై కవితల ద్వారా వివరించారు. అనంతరం భక్తి గీతాలు ఆలపించారు. అంతకు ముందు చిన్నారులు శ్రీవాసవి, సహనల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు వెంకన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్, ఉపాధ్యక్షుడు రావుల వెంకటేశ్వర్, కొలిప్యాక శంకర్, ఎకిరాల శంకర్, ఆకసం అధ్యక్షుడు నల్లగొండ రమేశ్, గుర్రాల వెంకటేశ్వర్లు, ధర్మపురి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీరాం సత్యనారాయణ, రాధాకృష్ణ చారి, తాటిపెల్లి జ్యోతి, కాచం సరిత, ధరణి శ్రీలత, గుండ మాయ, త్రివేణి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

దహెగాం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారడంతో మండల కేంద్రానికి చెందిన యువకులు చందాలు చేసి రోడ్డుకు సీసీ వేసి మరమ్మతులు చేయించారు. మండల కేంద్రంలోని రోడ్లు గుంతలుగా మారి వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయని జిల్లా అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదన్నారు. యువత స్వచ్ఛందంగా రూ.1లక్ష 20వేలను చందాలుగా వేసుకుని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కమ్మర్‌గాంలో వైద్య శిబిరం

పెంచికల్‌పేట్‌: మండలంలోని కమ్మర్‌గాం, గుండెపల్లి గ్రామాల్లో పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 84 మందిని పరీక్షించి 16 మంది నుంచి రక్త నమూనాలను సేకరిచారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ మాధురి, హెచ్ఏ ధర్మారావు, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి

ఆసిఫాబాద్‌: హైకోర్టు తీర్పుతో రిజర్వేషన్ పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు ప్రవీణ్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. హైకోర్టు తీర్పు బీసీల నైతిక విజయమని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు.

మహిళల సామూహిక పారాయణం

ఆసిఫాబాద్ అర్బన్‌: గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని గణేశ్ మండలపాల వద్ద ప్రత్యేక పూజలు, సామూహిక పారాయణం నిర్వహించారు. రాజంపేటలోని శివసాయి గణేశ్ మండపం వద్ద మహిళలు లలితా పారాయణం పఠించారు. అదే విధంగా బ్రాహ్మణవాడ నవయువ గణేశ్ మండలి వద్ద 21 రకాల నైవేద్యాన్ని సమర్పించారు.

ఒకరిపై కేసు

చింతలమానెపల్లి: కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించినందుకు రణవెల్లి గ్రామానికి చెందిన జాటోత్ దేవ్‌సింగ్ అనే వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రణవెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న అవతారే మారుతిని రణవెల్లికి చెందిన జాటోత్ దేవ్‌సింగ్ విధులను అడ్డగించడంతో పాటు దుర్భాషలాలడాడు. పంచాయితీ కార్యదర్శి మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు ఆటల్లేవ్‌..!

- ఖాళీగా వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు
- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- పట్టించుకోని విద్యాశాఖ



ఇది మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడామైదానం. మైదానం ఎత్తు వంపులు ఉంటుంది. ఆటలు ఆడేందుకు ఉపయోగపడదు. 196 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ పని చేసిన పీడీ ఇటీవల బదిలీ అయ్యారు. మరో వ్యాయమ ఉపాధ్యాయుడు రాలేదు. దీంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు.



ఈఫోటోలోని మైదానం మండలంలోని బీబ్రా ఉన్నత పాఠశాలది. ఈ పాఠశాలలో ఆరు నుంచి పది తరగతులు ఉన్నాయి. 108 మంది విద్యార్థులు చదువుతున్నారు. కానీ ఇక్కడ పీడీ (వ్యాయామ ఉపాధ్యాయుడి) పోస్టు ఖాళీగా ఉంది. దీంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. విద్యార్థుల సంఖ్య లేదని పోస్టు మంజూరు చేయలేదు. విద్యార్థులు రోజు పాఠశాలకు వచ్చి పాఠాలు వింటున్నారు. కానీ ఆటలు ఆడించేందుకు పీడీ లేక పోవడంతో చదువుకే పరిమితమవుతున్నారు.

దహెగాం: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీ (వ్యాయమ ఉపాధ్యాయులను) నియమిస్తుంది. వ్యాయమ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలో ప్రతీ రోజు ఆటలు ఆడిస్తున్నారు. పీడీ లేని పాఠశాలల్లో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు ఆటల పీరియడ్ ఉండాలని ఆదేశించింది. కానీ వ్యాయమ ఉపాధ్యాయులను నియమించలేదు.

ఏడు ఉన్నత పాఠశాలలు..

మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలున్నాయి. మండల కేంద్రంతో పాటు, బీబ్రా, ఇట్యాల, కుంచవెల్లి, చినరాస్పెల్లి, కేజీబీవీ, కల్వాడ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 196 మంది విద్యార్థులు ఉన్నారు. ఇటీవల బదిలీల్లో పీడీ బదిలీ కావడంతో పీడీ ఫిజిలక్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. మండలంలోని బీబ్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 108 మంది, ఇట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 217 మంది విద్యార్థులు ఉండగా.. అక్కడ కూడా పోస్టు మంజూరు కాలేదు. విద్యార్థుల సంఖ్య ఉన్నప్పటికీ విద్యాశాఖ దృష్టి సారించడం లేదు. మిగతా పాఠశాలలైనా కుంచవెల్లి, చినరాస్పెల్లి , కేజీబీవి, కల్వాడ ఆశ్రమ పాఠశాలల్లో పీడీలున్నారు. వ్యాయమ ఉపాధ్యాయులు ఉన్నా.. క్రీడలు ఆడించడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

క్రీడలకు ప్రాధాన్యత..

గతంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా క్రీడలు ఆడించే వారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రస్తుతం క్రీడలు ఆడించే వారు కరువయ్యారు. ఆగస్టు, జనవరి జెండా పండుగలకు వారం రోజుల ముందు ఆడించే వారు. ప్రస్తుతం పంద్రాగస్టు, 26 జనవరి జెండాలను ఎగురవేసుడే తప్పా క్రీడలు ఆడించడం లేదు. దీంతో విద్యార్థులు మరుగునపడుతుంది. మండల స్థాయి, జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యాశాఖ దృష్టి సారించి వ్యాయమ ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలోని బీబ్రా, ఇట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వ్యాయమ ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు కాలేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసిన వ్యాయమ ఉపాధ్యాయురాలు ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర ప్రాంతానికి వెళ్లారు. పీడీ ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– భిక్షపతి, ఇన్‌చార్జి ఎంఈవో

ఇల్లలకు లక్ష్మీ కళ వచ్చింది..!



లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

- సుఖసంతోషాల కోసం లక్ష్మీ పూజలు
- ఏళ్ల కాలం నుంచి కొనసాగింపు

కెరమెరి: మండల కేంద్రంతో పాటు కెలికే, కెలిబి, సాంగ్వి, మోడి తదితర గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో లక్ష్మీ పూజలు చేస్తారు. అధికంగా మరాఠి మాతృభాష వారు ఈ లక్ష్మీ పూజలను చేస్తారు. ఏళ్ల కాలం నుంచి వస్తున్న ఆచారాలను నేటికి మహిళలు పాటిస్తున్నారు. ఉదయం, సాయంకాలం ప్రత్యేక పూజలు చేస్తారు. మూడు రోజులుగా కొనసాగిన లక్ష్మీదేవి పూజలు గురువారంతో ముగిశాయి.

పొలాల తర్వాత 9వ రోజు నుంచి..

ప్రతీ సంవత్సరం పొలాల అమావాస్య పర్వదినం అనంతరం లక్ష్మీ పూజలను జరుపుకుంటారు. ప్రథమ రోజు లక్ష్మీదేవి ఆగమనం, ఆ రోజు మహిళలను అందరిని పిలిపించి గాజులను అందజేయడం, నైవేద్యం సమర్పిస్తారు. రెండో రోజు మహాపూజ, అన్నదానం. మూడో రోజు ఉత్తర పూజ చేసి లక్ష్మీదేవిని సాగనంపడం చేస్తారు. మంగళవారం ప్రారంభమైన లక్ష్మీదేవి పూజలు గురువారం రాత్రికి ముగిశాయి. ప్రత్యేక మండపాల్లో మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో ప్రతిష్టిస్తారు.

ఓసీపీలో ఈపీ ఆపరేటర్ల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆపరేటర్లు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో గురువారం ఈపీ ఆపరేటర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని శ్రీరాంపూర్ నుంచి బెల్లంపల్లి ఏరియా వరకు ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఈపీ ఆపరేటర్లు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఖాళీలు లేవనే సాకుతో అర్హత కలిగిన ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు కల్పించడం లేదన్నారు. సకాలంలో ప్రమోషన్లు రాక సర్వీసు పరంగా, ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. కంపెనీ నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని సాధించటంతో పాటు మెరుగైన ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించటంలో ఈపీ ఆపరేటర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అలాంటి ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వకుండా అన్యాయం చేయటం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ఖాళీలతో సంబంధం లేకుండా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈపీ ఆపరేటర్లకు గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో పాటు ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, హెచ్ఎంఎస్ సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమాల్లో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, సీనియర్ ఆపరేటర్లు కార్నాథం వెంకటేశం, రాజేశ్, అంబేద్కర్, మురహరి, సంపత్, తిరుపతి, సత్యనారాయణ, రమేశ్, అంజయ్య, చంద్రశేఖర్, ఇక్బాల్, తిరుపతి పాల్గొన్నారు.

ఇల్లు పీకి పందిరేసి..!

- కోతుల వీరంగం
- ప్రజలపై దాడులు చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



కౌటాలలో సంచరిస్తున్న కోతులు

కౌటాల: అడవుల్లో ఉండాల్సిన కోతులు మండల కేంద్రంలో సంచరిస్తున్నాయి. కౌటాల మండల కేంద్రంలో కోతులు రెచ్చిపోతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కోతుల బెడదతో చేతిలో వస్తువులు పట్టుకొని రోడ్డు వెంట నడవాలన్న భయపడుతున్నారు. ఇంటి తలుపులు తిరిచి ఉన్నా.. ఇబ్బందులే. మండల కేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులు గుంపులుగా వచ్చి దాడులకు తెగబడుతున్నాయి. వీటి బారి నుంచి రక్షణ కల్పించాలని మండల వాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదు.

కోతి చేష్టలు ఇలా..

- తలుపులు తెరిచినప్పుడు, కిటికీల ద్వారా ఇళ్లలోకి చేరుతున్నాయి. గదుల్లోని సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి.
- వంట గదుల్లోని పప్పులు, చక్కెర తదితర డబ్బాలను పడవేస్తున్నాయి. దేవాలయాల వద్ద కొబ్బరిచిప్పలు, అరటిపండ్ల వంటి వాటికోసం పైకి ఎగబడుతున్నాయి.
- ఇళ్లలో కనిపించే వస్తువుల కోసం నేరుగా ఇళ్లలోకే చొరబడి అందిన కాడికి లాక్కెలుతున్నాయి. దీంతో కోతులను కర్రలు పట్టి బెదిరించి తరిమేస్తున్నారు. ఇలాంటి పనులు ప్రజలకు నిత్యకృత్యంగా మారాయి.
- ఆయా కార్యాలయాలకు ఎవరూ వచ్చినా.. ప్రతి ఒక్కరిని కోతులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ శాఖ, సహకార సంఘం కార్యాలయల ముందు ఉన్న చెట్లపై కోతులు బారులు తీరి ఉంటున్నాయి.
- ద్విచక్ర వాహనాల సీటు కవర్‌లో ఏమైనా పండ్లు, కూరగాయలు, తినుబండారులు ఉంటే ఎత్తుకెళ్తున్నాయి. అలాగే వాహనాలపై గెంతుతూ.. హంగామా చేస్తున్నాయి.
- చేతిలో కవరు పట్టుకొని రోడ్డు వెంట వస్తే కవర్లను లాక్కుని పోతున్నాయి. పండ్లు, కూరగాయలు చేతి కనబడితే దాడి చేస్తున్నాయి.

నిందితుడిని ఉరి తీయాలి



కెరమెరి: ఎస్సైకి వినతిపత్రం అందిస్తున్న మహిళలు

కౌటాల/తిర్యాణి/కెరమెరి/సిర్పూర్(టి)/ బెజ్జూర్: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యయత్నం చేసిన నిందితుడిని ఉరి తీయాలని గురువారం ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా మండల కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఆదివాసీలపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. బాధిత మహిళను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

నేడు ఓటర్ జాబితా విడుదల

కౌటాల: కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ జాబితా ప్రదర్శించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్. సాయికృష్ణ గురువారం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన 2024 ఓటరు విడుదల, వార్డుల వారీగా ప్రదర్శిస్తామన్నారు. ఉదయం 10.30 గంటలకు కౌటాల ఎంపీడీవో కోట ప్రసాద్ ఆధ్వర్యంలో ఓటర్ జాబితాను విడుదల చేస్తామని, ప్రజాప్రతినిధులు, నాయకులు, సకాలంలో హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



శివాలయంలో గణేశుడికి పూజలు చేస్తున్న భక్తులు

కెరమెరి: ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ఆయా గణేశ్ మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంటుంది. గణపతి మహారాజ్‌కి జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు నెహ్రూనగనర్, సేవాలాల్‌నగర్, శివమందిర్, విద్యానగర్ ప్రాంతాల్లో గణపతికి నిత్యం పూజలు కొనసాగుతున్నాయి. గురువారం మండల కేంద్రంలోని శివాలయయంలో ఐదు జంటలు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా మండల పాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తిర్యాణి/రెబ్బెన: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. గురువారం తిర్యాణి మండల కేంద్రంలో 62 లబ్ధిదారులకు, రెబ్బెన మండలంలోని 77 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదనంగా తులం బంగారం ఇస్తామని హామి ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు అమలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కార్యక్రమంలో తిర్యాణి ఎంపీడీవో వేముల మల్లేశ్, డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ, రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, ఆర్ఐ ప్రేంకిరణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: మండల కేంద్రంలోని ప్రగతి నగర్‌లో శ్రీదుర్గా భవానీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడిని గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

వరద బాధితులకు కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల్లో నష్టపోయిన ఖమ్మం జిల్లాలోని మున్నేరు గ్రామంలో భారీ వరద చేరుకొని ఇళ్లు మొత్తం నీటియమం కావడంతో అక్కడ ప్రజలు ఆర్థిక, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వాటిల్లిందని, ప్రజలు తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని బతుకుతున్న పరిస్థితుల్లో డీవైఎఫ్ఐ వారికి అండగా నిలవాలన్న ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తుందని నాయకులు కార్తీక్, టీకానంద్‌లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో డీవైఎఫ్ఐ, టిఏజీఎస్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఆపదలో ఉన్న బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచేందుకు సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాలశ్రీ, నిఖిల్, చిరంజీవి, సతీష్ పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు



డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: గణేశ్ నిమజ్జన వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని డీజే నిర్వాహకులతో పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నిమజ్జన వేడుకల్లో ఎట్టి పరిస్థితుల్లో డీజేలు పెట్టవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ.. ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జన వేడుకలను జరుపుకోవాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గురువారం ఆసుపత్రి ఎదుట కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల వేతన బడ్జెట్ విడుదల చేయలేదని, దీంతో ఏజెన్సీ కాంట్రాక్టర్లు కార్మికులకు సకాలంలో వేతనాలను చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. చాలీచాలని వేతనాలను కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచితే కార్మికుల జీవనం సాగేదెలా అని ప్రశ్నించారు. కార్మికులు ఇంటి అద్దెలు, నెలవారి ఈఎంఐలు, పొదుపు సంఘాల చెల్లింపులు, పిల్లల ఫీజులు కట్టుకోలేక మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి చిరంజీవి, కార్మికులు మల్లేష్, సత్తార్, మురళి, మమత పాల్గొన్నారు.

కంపెనీ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా క్రీడాకారులు కంపెనీ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో డబ్ల్యూపీఎస్, జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా డిపార్ట్‌మెంట్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు అద్భుత ఆటతీరును ప్రదర్శించి పతకాలు సాధించాలన్నారు. నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యాజమాన్యం అన్ని వసతులు సమకూరుస్తుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కైరిగూడ పీవో జట్టుపై ఎస్‌వోటూజీఎం గ్రూపు జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తప్పులు సరిచూసుకోండి

నార్నూర్: అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని ఎంపీవో స్వప్నశీల గురువారం తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వార్డు వారీగా ప్రచురించిన ఓటరు జాబితాను పరిశీలించి తప్పుఒప్పులు ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఉందన్నారు. ఎలాంటి అనుమానం ఉన్నా.. సంబంధిత పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు.